**జరిగిన కథ :** కాశీమజిలీల్లో ఇంతకుముందే చెప్పుకొన్న సప్తమిత్ర చరిత్రలో.. ఒక సందర్భం ఉంది. ఘోటకముఖుడు.. మిత్రవింద అనే స్త్రీతో దత్త చరిత్రలోని మదాలస కథను చెప్పాడు. మదాలస గొప్ప పతివ్రత. గొప్ప మాతృమూర్తి. సప్తమిత్ర చరిత్ర కథా సందర్భంనుంచి వేరుపరిచి మదాలస గాథను ఓసారి పరికిద్దాం.




అనుసృజన: నేతి సూర్యనారాయణ శర్మ



# మదాలస పూర్వజన్మ

శత్రుజిత్తు అనే మహారాజు కుమారుడు ఋతుధ్వజుడు.

ఆ రాజపుత్రుడు బుద్ధికి బృహస్పతి. రూపానికి మన్మథుడు. అతనికి సమాన వయోబుద్ధి విక్రమాలు కలిగిన స్నేహితులు అనేకమంది ఉండేవారు. వారితో కలిసి వీణాగానం, కవిత్వ రచన, తపోధనుల ఆరాధన, శాస్త్రార్థ ప్రసంగాలు చేస్తుండేవాడు. వేటాడినా, నౌకా విహారాలు చేసినా.. భోగస్త్రీలను మాత్రం దగ్గరికి రానిచ్చేవాడు కాదు. వయసులో చిన్నవాడే అయినా అతని కీర్తి ముల్లోకాలలోనూ వ్యాపించింది.

అతని స్నేహితులలో ఇద్దరు నాగకుమారులు కూడా ఉండేవారు. పాతాళంలో ఉండే అశ్వతరుడనే నాగరాజు పుత్రులు వారు. ప్రతిరోజూ ఉదయాన్నే మానవ రూపాన్ని పొంది, ఋతుధ్వజుని వద్దకు వచ్చేవారు. ఆ ముగ్గురి స్నేహం లోకాలకే ఆదర్శప్రాయంగా ఉండేది.

ఇలా ఉండగా నాగరాజు అయిన అశ్వతరుడు..

''కుమారులారా! మీరు ప్రతిరోజూ ఉదయాన్నే ఎక్కడికి వెళ్తున్నారు? మళ్లీ చీకటి పొద్దులో తప్ప ఇంటికి తిరిగి రావడం లేదు. ఇంతసేపు ఎక్కడ ఏం చేస్తున్నారు?'' అని ఆరా తీశాడు.

అప్పుడు వారు, తమ స్నేహితుడైన ఋతుధ్వజుని గుణగణాలను కీర్తిస్తూ అతని గురించి అనేక విశేషాలు తండ్రికి తెలియచేశారు.

ఆ కథలన్నీ విన్న తరువాత..

''ఇంతటి పుణ్యాత్ముడు మీకు స్నేహితుడు కావడం నిజంగా అదృష్టం. అతని గుణాలను గురించి విన్న తరువాత అతనికేదైనా మహోపకారం చేయాలని ఉంది. అతనికేం కావాలో కనుక్కుని నాకు చెప్పండి'' అన్నాడు అశ్వతరుడు.

''తండ్రీ! అతనివద్ద లేనిది మనమేమి ఇవ్వగలం? అతను పరధనాన్ని ఆశించడు కదా!'' అని సందేహం వ్యక్తం చేశారు కుమారులు.

''అయినా సరే.. అతను కోరితే ఏదైనా ఇవ్వాలని నాకు బలంగా అనిపిస్తున్నది'' అన్నాడు తండ్రి.

అప్పుడు ఆ కుమారులు అశ్వతరునికి ఒక విశేషాన్ని తెలియచేశారు.

''తండ్రీ! ఋతుధ్వజునికి కావాల్సిన వస్తువేదీ లేదు. కానీ, అతని మనసుకు ప్రియమైనది ఒకటుంది. దానిని సాధించిపెట్టాలంటే.. త్రిమూర్తులకే తప్ప ఇతరులకు శక్యం కాదు. అయినప్పటికీ విద్వాంసులకు సాధ్యం కానిది లేదు. దృఢమైన సంకల్పం ఉంటే దేవత్వాన్ని కూడా సంపాదించవచ్చు. చీమ కూడా నిత్యం నడిస్తే వందయోజనాల దూరంలోని తన గమ్యస్థానాన్ని చేరుకోగలదని మీరు తరచుగా మాకు ప్రబోధం చేస్తుంటారు కనుక, అతని మనోభీష్టాన్ని గురించి చెబుతున్నాం.. వినండి.

* * *

ఋతుధ్వజుని చిన్నవయసులో గాలవుడు అనే మహర్షి ఒక గుర్రమెక్కి, శత్రుధ్వజుణ్ని సందర్శించాడు. ఆయన చేత అర్చించబడిన తరువాత..

''మహారాజా! నేను తపస్సు చేసుకుంటుండగా.. ఒక రక్కసుడు నా ఆశ్రమానికి వచ్చి తన మాయాప్రభావం చేత నా తపస్సును భగ్నం చేస్తున్నాడు. నేను కన్నులు మూసుకునే వేళకు వాడు వచ్చి, ఏదో అల్లరి చేసి, నా మనసును చలింప చేస్తున్నాడు. నా కంటిచూపుతో వాణ్ని భస్మం చేయగలను. కానీ, దానికోసం నా తపస్సును వ్యయం చేసుకోవడం నాకిష్టంలేదు.

ఒకనాడు ఆ రాక్షసుని చేష్టలు చూస్తూ.. ఆకాశం వంక చూస్తూ, వేడి నిట్టూర్పు విడిచాను. ఆ నిశ్వాసం నుంచి ఇదిగో ఈ తురగం పుట్టింది. వెనువెంటనే ఆకాశవాణి.. 'గాలవా! ఈ సైంధవం పాతాళంలోనూ, ఆకాశంలోనూ, నీటిలోనూ కూడా నిరాటంకంగా పోగలదు. భూవలయమంతా ఆయాసం లేకుండా పరిగెత్తగలదు. కాబట్టి దీనికి కువలయము' అనే పేరు వచ్చింది. దీనిని తీసుకుపోయి, శత్రుజిత్తుని కుమారునికి అర్పించు. అతనే ఆ రాక్షసుణ్ని సంహరించగలడు' అని పలికింది.

కాబట్టి ఓ రాజా! ఈ గుర్రాన్ని నీకొడుక్కి ఇస్తున్నాను. దీనిపై నీ కొడుకును ఎక్కించి నా ఆశ్రమానికి పంపు. అతనే శత్రుసంహారం కావించగలడు'' అని కోరాడు.

రాజు అందుకు ఒప్పుకొన్నాడు. కుమారునికి ఆనతిచ్చాడు. కువలయము అనే అశ్వాన్ని ఎక్కి సంచరిస్తాడు కాబట్టే.. ఋతుధ్వజునికి ఆనాటినుంచి కువలయాశ్వుడు అనే పేరు కలిగింది.

అతను గాలవ మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. ఒక సంధ్యాసమయంలో మహర్షి అగ్నిని అర్చిస్తున్న వేళ.. రాక్షసుడు వరాహరూపంలో వచ్చాడు. రాజపుత్రుడు తురగమెక్కి, విల్లు ఎక్కుపెట్టాడు. వరాహాన్ని అర్ధచంద్రాస్త్రంతో కొట్టాడు.

ఆ దెబ్బతో అది మొర్రో అంటూ బొబ్బపెడుతూ.. ఒక గోతిలో పడి, పాతాళానికి పోయింది. కువలయాశ్వుడు కూడా దానిని వెంబడించాడు. దారంతా అంధకార బంధురంగా ఉంది. అందులో వెళ్లగా వెళ్లగా.. గొప్ప తేజస్సుతో ప్రకాశించే ఒక నగరం కనిపించింది.

అక్కడ ఆ వరాహం కానీ, మరెవరుకానీ కనిపించలేదు.

ఒక భవంతి ముందర ఒక యువతి కనిపించింది. ఆమెను చూసి.. 'ఆ పురమెవ్వరిది?' అని ఆరా తీయ